క్లుప్తంగా

బీఆర్ఎస్‌కు రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న ఒగ్గు బాలరాజు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కొద్దిరోజులుగా ఆందోళనలు, మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు అన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. అఖిల పక్షం నాయకుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలన్న ఉద్యమ సంకల్పానికి కట్టుబడి ఉంటామన్నారు. రాజీనామా లేఖను మంత్రి కేటీఆర్‌కు ఫ్యాక్స్ చేశామన్నారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, గంభీరావుపేటతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యే వరకు ఉద్యమం ఆగదని స్పష్టంచేశారు. అఖిల పక్షం నాయకులు చెన్ని బాబు, గుండాడి రాంరెడ్డి, రఫీక్, పందిర్ల లింగం, శ్రీనివాస్, తిరుపతి, వరదవెల్లి స్వామి, అంజయ్య, పర్శరాములు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా సంక్షేమ గురుకుల డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజని ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం (సీ.ఏ), బీఎస్సీ (లైఫ్ సైన్స్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీఏ, బీఏ (హానర్స్), ఇంటీరియర్ డిజైన్, బీఏ హానర్స్ ఫ్యాషన్ డిజైన్, బీఏ హానర్స్ ఫొటోగ్రఫీ కోర్సులున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9502082958, 9703709376 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీ– కిష్టయ్య కూతురు అరుణ వివాహానికి ముస్తాబాద్ ఎంపీపీ జనగామ శరత్‌రావు పుస్తె,మెట్టెలు వితరణ చేశారు. శనివారం పెళ్లి మండపంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, వార్డు సభ్యుడు బద్దిపడిగె నవీన, కంచం నర్సింహులు పుస్తె, మెట్టెలను అందజేశారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని నాగారంలో ఇటీవల బలగం సినిమా నటుడు కీసరి నర్సింగం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ మ్యాకల రజిని, బీసీ జిల్లా అధ్యక్షురాలు జి. అరుణ, మహిళా విభాగం నాయకురాలు చీటి సంధ్య పరామర్శించారు. వారి వెంట మెరుగు గోపి, తదితరులున్నారు.

ఎంపీటీసీకి..

మండలంలోని కనగర్తి ఎంపీటీసీ లింగంపెల్లి లక్ష్మి భర్త లింగయ్య ఇటీవల మృతిచెందగా సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, నాయకులు దేవరకొండ సంపత్‌కుమార్, మల్యాల స్వామి, తదితరులున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇల్లంతకుంట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని వంతడుపుల గ్రామంలో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా ఏర్పాటు చేసిన పిండి గిర్నిని ప్రారంభించారు. సర్పంచ్ కట్ట వెంకట్‌రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, వీఓ అధ్యక్షురాలు మౌనిక, సీసీలు రామచంద్రారెడ్డి, సదయ్య, వెంకటేశం, తదితరులున్నారు.


కేక్ కట్ చేసిన నాయకులు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్: రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు జన్మదిన వేడుకలను మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంచం మంజుల, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీను, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, మెంగని మనోహర్, భరత్, స్వామి, సాయిలు, దేవేందర్, గిరి, చిన్న అంజిరెడ్డి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో శనివారం ఐదేళ్ల బాలుడు మోతె రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి చిన్నారి జన్మదిన వేడుకలు జరిపారు.

అలంకారప్రాయంగా ఆధునిక మార్కెట్



రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



ఆధునిక హంగులతో నిర్మించిన కూరగాయల మార్కెట్

- రూ.2.50 కోట్లతో వెజిటబుల్ మార్కెట్ నిర్మాణం
- ఇటీవల మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభం
- అందుబాటులోకి రాకపోవడంతో అలంకారప్రాయంగా..
- రోడ్డుపైనే సంత నిర్వహిస్తున్న వ్యాపారులు

వేములవాడ: వేములవాడ మూలవాగు ఒడ్డున వైకుంఠ ధామం ముందు నుంచి ప్రారంభమై చివరి వరకు కూరగాయల మార్కెట్ బైపాస్‌రోడ్డు వెంటే కొనసాగుతోంది. ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. అయితే రూ.2.50 కోట్లు వెచ్చించి పోలీస్‌స్టేషన్ ఎదురుగా శామకుంటలో వెజిటబుల్ మార్కెట్‌ను ఇటీవల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కోట్లాది రూపాయలతో నిర్మించినా అందుబాటులోకి తీసుకురావడం లేదని పలువురు వాపోతున్నారు. గతంలో బ్రాహ్మణవీధిలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను కరోనా సమయంలో మార్కెట్ యార్డుకు మార్చారు. అనంతరం మార్కెట్ యార్డు ముందు కొనసాగింది. రెండోదఫా కరోనా సమయంలో మూలవాగు ఒడ్డున గంగమ్మ గుడి వద్దకు మార్కెట్‌ను తరలించారు. ఈ క్రమంలో చిరు వ్యాపారులంతా అక్కడే ఉంటూ విక్రయాలు జరుపుతున్నారు. ఆధునిక హంగులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలిపోతుంది.

బైపాస్ రోడ్డుపై విక్రయిస్తున్నాం



మేము బైపాస్ రోడ్డుపైనే కూరగాయల విక్రయిస్తున్నాం. పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిర్మించిన భవనంలోకి వెళితే గిరాకీ రాదు. ఇక్కడైతే జన సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే మరిన్ని ఏర్పాట్లు చేయాలి.

– మమత, చిరువ్యాపారి

సౌలభ్యంగా ఉంటుందనే..



కోట్లాది రూపాయలతో కూరగాయల మార్కెట్ నిర్మించారు. ఇటీవల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అయినా నేటికీ అందుబాటులోకి తీసుకురావడం లేదు. కాలనీవాసులు, స్థానికులకు సౌలభ్యంగా ఉంటుందనే మార్కెట్‌ను నిర్మించారు.

– గౌరీ శంకర్, శివాయినగర్

చొరవ తీసుకుంటాం



కొత్తగా నిర్మించిన మార్కెట్‌లో విక్రయాలు కొనసాగించాలని చెబుతున్నా చిరువ్యాపారులు వినడం లేదు. త్వరలో వ్యాపారులతో సంప్రదించి కొత్త మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేలా చూస్తాం. వెజ్ మార్కెట్‌లోకి వ్యాపారులు వచ్చేలా చొరవ తీసుకుంటాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం



ఎల్లారెడ్డిపేటలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



వేములవాడ అర్బన్ : కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

- బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పోలీస్ అధికా రులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు సాహితీ రంగానికి కాళోజీ చేసిన సవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది, తదితరులున్నారు.

మహిళా గిరిజన డిగ్రీ కళాశాలలో..

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలంగాణ భాష, యాస, సంస్కృతి, గొప్పదనం గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, అధ్యాపకురాలు భార్గవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో తెలంగాణ వివేక రచయితల సంఘం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన ఎన్నో గ్రంథాలను రూపొందించారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమే, ప్రధాన కార్యదర్శి కట్ల శ్రీనివాస్, నాయకులు అజయ్, ప్రవీణ్, నరేశ్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, నాయకులు సుభాశ్, నర్సింహారెడ్డి, రాజం, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాల, కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్ మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావును స్ఫూర్తిని యువత కొనసాగించాలన్నారు. కళాశాల కో ఆర్డినేటర్ దేవయ్య, నళిని, ్హారుతి, చో లే శ్వర్, విష్ణు, జలజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

గంభీరావుపేట: కామారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ మండలంలోని లింగన్నపేటలో జూన్ 10న సెల్‌ఫోన్ పాగొట్టుకున్నాడు. తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసులకు తెలుపగా సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను కనుక్కొని ఇస్మాయిల్‌కు అప్పగించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బియ్యం వితరణ

గంభీరావుపేట: మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన కోన నాంపల్లి (మేదరి) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గంభీరావుపేటకు చెందిన 'మా' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మల్లుగారి నర్సాగౌడ్ 50 కిలోల బియ్యం అందజేశారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు కరీంనగర్ జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చాటి బహుమతులు అందుకున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయుడు చిలుక గట్టు, ఉపాధ్యాయులు అభినందించారు.

శిక్షణ శిబిరానికి తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు



ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండలంలో జరిగిన కాంగ్రెస్ శిక్షణ శిబిరాలకు మండలకేంద్రం నుంచి ఆ పార్టీ నాయకులు శనివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. శనివారం మండలకేంద్రంలో నలుగురికి రూ.లక్షా 30 వేలు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇక్కడ సర్పంచ్ అంకారపు అనిత, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, టౌన్ అధ్యక్షుడు బండి జగన్, ఏఎంసీ డైరెక్టర్ సద్ద శోభ, నాయకురాలు సంధ్యారాణి, రామగౌడ్, హమీద్, జగత్, లక్ష్మారెడ్డి, పరశురాములు, అనిల్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నవీన్ రెడ్డి, మహేశ్, నులుగొండ శ్రీనివాస్, రమేశ్, రమణ, దుర్గయ్య ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ముస్తాబాద్: ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన కౌలు రైతు అనమేని నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఇద్దరు చిన్నారుల చదువులకు సహకరిస్తామన్నారు. గూడెం గ్రామానికి చెందిన చిట్నేని వెంకటేశ్వర్ రావు, మాధవి దంపతులు రూ.5వేలు అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి రూ.5వేలు, నందెల్లి వేణురావు రూ.2వేలు, శాలివాహన సంఘం తరపున రూ.5వేలు, అనమేని బాలయ్య రూ.2వేలు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, రాజు, గోపాల్ రావు, నందు, కంచం నర్సింలు తదితరులున్నారు.

కోనరావుపేట: మండలంలోని ఎగ్లాస్‌పూర్‌కు చెందిన జిల్లా మహేశ్ కుటుంబానికి భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ రూ.5వేలతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా సంఘం నాయకులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. అయిల రమేశ్, లవన్, చందు, రాజేశ్, అభిలాష్, మహేశ్, తదితరులున్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఇల్లంతకుంట: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలో అంగన్‌వాడీ–2 కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ ఒగ్గు విజయలక్ష్మి, ఆశ కార్యకర్త లక్ష్మి, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి సీనియర్ వైద్యుడు పయ్యావుల దేవదాస్ రూ. 10,116 విరాళంగా అందజేశారు. గ్రామంలోని బస్టాండ్ వద్ద శిథిలావస్థకు చేరుకున్న పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న దేవదాస్ తనవంతు సాయంగా నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా



తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మానేరు వాగు నుంచి నీటిని సరఫరా చేసే పైపులు కొట్టుకుపోవడంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. నల్లా ద్వారా కలషిత నీరు వస్తుండటంతో ఇంటింటికీ గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. త్వరలోనే నీటి పైపులైన్ మరమ్మతు పనులు చేస్తామని అధికారులు తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఏఎంసీ పాలకవర్గం



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పాలకవర్గ సభ్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన నామినేటెడ్ పాలకవర్గం శనివారం ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపెల్లి సరస్వతి, వైస్ చైర్మన్ బండారి శ్యాం చందర్, డైరెక్టర్లు బైరి రమేశ్, సద్ద శోభ, బూర్గుపల్లి మల్లేశం, వంగ తిరుతపతి రెడ్డి, పెంజర్ల మల్లయ్య, శ్యాగ దేవేందర్, సింగరవేని తిరుపతి, షేక్ అలీ, కంది భాస్కర్ రెడ్డి, ఉప్పుల లక్ష్మారెడ్డి, జూపల్లి రఘు నందన్ రావు, కట్కం శ్రీనివాస్, నాయకులు పడిగెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్‌కు నర్సయ్య పేరుపెట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: మల్కపేట రిజర్వాయర్‌కు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కర్రెల నర్సయ్య పేరు పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ప్రాంత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన అతి సాధారణ జీవితం గడిపి ఆదర్శంగా నిలిచారన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, ఎలిగేటి రాజశేఖర్, బెజిగం సురేశ్, దాసరి రూప, సందుపట్ల పోచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై నవత

వీర్నపల్లి(సిరిసిల్ల) : సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నవత సూచించారు. మండలంలోని బాబాయి చెరువు తండాలోని గిరిజనులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకుంటే డయల్ 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కిషన్‌రావు, సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ రాములు, నాయకులు సంతోష్, కానిస్టేబుళ్లు ప్రశాంత్, హోంగార్డులు గోపాల్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

హిందూ, ముస్లింలు అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై నవత పేర్కొన్నారు. మండలకేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. వినాయయ చవితి సమీపిస్తున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఏఎస్సైలు రాజిరెడ్డి, కిషన్ రావు, హిందువు, ముస్లిం పెద్దలు, మండప నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పురాతన ఆలయ జీర్ణోద్ధరణ అనంతరం వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, స్వామివారికి అభిషేకం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్నేని సవిత, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సామాజిక కార్యకర్త చిట్నేని వెంకటేశ్వర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, సర్పంచులు కిషన్‌రావు, రవీందర్ రెడ్డి, నాయకులు లక్ష్మీ నర్సింహారావు, శ్రీనివాస్ రావు, విద్యాసాగర్‌రావు, రవి, రమణ, గిరి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక రవాణా

- మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌తో బెంబేలు..
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి



రుద్రంగిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

రుద్రంగి(వేములవాడ): మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గృహనిర్మాణాల కోసం ప్రభుత్వం, ఉన్నతాధికారులు తహసీల్దార్ అనుమతితో ఇసుకను తెప్పించుకునే అవకాశం కల్పించారు. అయితే దానిని కూడా ఎగవేయాలన్న ఉద్దేశంతో కొత్త పోకడలకు తెరలేపారు. సెలవుదినాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే పట్టుకునే వారు ఉండరని యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇష్టారీతినా ఒర్రెల్లో నుంచి ఇసుక తవ్వేస్తుండడంతో పంటపొలాలు కోతకు గురై దారులన్నీ ధ్వంసమవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఒకే అనుమతితో..

ధనార్జనే ధ్యేయంగా ఒకటి, రెండు ట్రాక్టర్ల ఇసుకను తరలించేందుకు అనుమతులు తీసుకొని అధికారుల కళ్లు గప్పి పదుల సంఖ్యలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పగలు, సెలవు దినాల్లోనే కాకుండా నిత్యం రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రంతా ఇసుక ట్రాక్టర్ల శబ్దంతో కంటిమీద కునుకు కరువైందని వాపోతున్నారు.

మైనర్ల ర్యాష్ డ్రైవింగ్..

ఎలాంటి లైసెన్సులు లేని మైనర్లు అతివేగంగా ఇసుక ట్రాక్టర్లను నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌తో ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై రుద్రంగి తహసీల్దార్, ఎస్సైని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా స్పందించ లేదు.